# దేవుళ్ళారా బతకండి!

నేనా స్కూలుకు కొత్త. హెడ్మాష్టరుగా వచ్చి చేరిన మరుక్షణంనుండే నాగుండెలు గుబగుబలాడ్డం మొదలెట్టేయి. తలెత్తి మీదికి చూడాలంటే భయం. తీరిగ్గా గోడకానుకుని కూర్చోవాలంటే భయం. నడుంమీద చెయ్యేసుకుని స్తంభంమీద చెయ్యిపెట్టి హెడ్మాస్టరీ ఫోజు పెట్టాలంటే భయం. అంతెందుకు తలుపులుతీసి లోపలికి అడుగు పెట్టాలంటే భయం భయం.

భక్తులు క్షణంసేపైనా దేవుణ్ణి ఏమరుస్తారేమోగాని మా పాఠశాల 'భవనం' మాత్రం పంచభూతాలకీ ఎప్పుడూ తృణమో పణమో అన్నట్టుగా పెంకో పెచ్చో రాలుస్తూ ఉడతాభక్తిని చూపుతూ ఉంటుంది.

గట్టుమీద వుండివుంటే నేనూ చిన్నచూపు చూసివుండే వాణ్ణే! లేదూ, అటువంటి పాఠశాలల గురించి పట్టించుకోనందుకు మునిసిపాలిటీని విమర్శించేవాణ్ణి. వ్యాపారదృష్టితో విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాన్ని ఏరిపారేసేవాణ్ణి. అటువంటి దరిద్రగొట్టు స్కూల్లో దీనమైన మొహాలు పెట్టుకుని పాఠాలు చెప్పుకుంటున్న మేస్టర్లనీ, పాఠాలు వింటున్న పిల్లల్నీ చూసి నోటికి చెయ్యడ్డం పెట్టుకుని వెక్కిరించేవాణ్ణేమో!

కాని అటువంటి పాఠశాలకి నేను ప్రధానోపాధ్యాయుణ్ణి!

విమర్శలూ, వెటకారాలూ అనవసరం. కారణాలూ, పరిస్థితులూ అప్రస్తుతం. ఇప్పుడు నేను తీసుకోవలసిన చర్య ఏమిటి అని ఆలోచించాను.

వెంటనే మునిసిపల్ కమీషనరుగారికొక అర్జీ పెట్టాను. మామూలుగా కాదు, బాజాభజంత్రీలతో కూడా. అంటే వార్డులోని ప్రముఖుల సంతకాలు సేకరించి మరీనూ.

వెంటనే ఈ పాఠశాలను పునాదుల్తో సహా పడగొట్టించవలసినదనిన్నూ, పాఠశాలకు మరో స్థలం చూపించవలసినదనిన్నూ, లేనిపక్షంలో ముక్కుపచ్చలారని పసిపాపల ప్రాణాలకు ముప్పు వాటిల్లగలదనిన్నూ దఖలుపరిచేను.

ఏ షాపింగు కాంప్లెక్సో, మరో రోడ్లబెండరో అయితే నిత్యపంట. ఇటువంటి పాఠశాలల గురించి పట్టించుకుంటే ఏమొస్తుంది-బూడిద!

అంచేత సహజంగానే ఆ అర్జీని గురించి పట్టించుకోలేదు. కాని నేను హెడ్మాస్టర్ని. చూసిచూసి విసిగివిసిగి "పాఠశాల మార్చకపోతే మానేరు, కాస్త చూరు నిలబడేపాటి రిపేర్లన్నా చేయండి దేవుళ్ళారా?'' అంటూ మరో అర్జీ దాఖలు చేసేను. ఉత్తి అర్జీమాత్రమే కాకుండా ఈసారి పెర్సనల్‌గా మునిసిపల్ కమీషనరువారినీ, ఇంజనీరు మహాశయులనీ పదేపదే కలుసుకుని పరిస్థితులు విన్నవించుకున్నాను.

అర్జీ ఒక్కటే అయితే బుట్టదాఖలయ్యుండేది. మాటి మాటికి నా ముఖం కనపడ్డంతో 'ఏడేమిటి! పట్టుకుని వదల్డు' అనుకున్నారో ఏమో-రిపేర్ల నిమిత్తము పదివేల రూప్యములు మంజూరైనట్టూ, సదరు రిపేర్లు జరుగుటకు వీలుగా ప్రధానోపాధ్యాయుని సహకరించవలసిందిగా కోరుతూ తాఖీదు వచ్చింది.

ఖారం దిగిపోయింది!

కొండెక్కినంత సంబరపడ్డాను.

వెనకప్రక్కనున్న ఖాళీ జాగాలో ఎలానో షిఫ్టు పద్ధతి ద్వారా స్కూలుపనికి అంతరాయం లేకుండా ఏర్పాటుచేశాను.

నెల్లాళ్ళు గడిచేసరికి ముసలి హీరోగారు జీన్స్ వేసుకుని ఎవర్‌గ్రీన్ హీరో అనిపించుకున్నట్టుగా తయారైపోయింది మా స్కూలు.

పాఠశాల యధాప్రకారం పాతటైమింగ్స్ అనుసరించి మర్నాటినుండి పనిచేస్తుందని సర్క్యులర్ కూడా జారీచేసేను.

మర్నాడు ధీమాగా స్కూలుకు వెళ్ళుదునుకదా గునపాలూ, పారలూ, తట్టల్తో ఏభై అరవై మంది స్కూలుమీద దండెత్తినట్టుగా మూగివున్నారు. "ఏవిటి తగువు ఏవిటి విషయం?" అని గాభరాపడుతూ అడిగేను.

"మరేంలేదు మేస్టారూ....మీరు మొదట పెట్టుకున్న అర్జీ ఇప్పుడు మంజూరైంది. ఇప్పుడు పడగొట్టించెయ్యమని ఆర్డర్సు వచ్చేయి...." అంటూ ఆర్డరు కాపీని నా చేతిలో పెట్టేడు ఇంజనీరింగు సూపర్‌వైజరు!

★